క్లుప్తంగా

పంటల బీమా చేయించుకోండి

అట్లూరు : రైతులు ఈ నెల 31 తేదీ లోగా ప్రధానమంత్రి ఫసల్ భీమా చేయించుకోవాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతులు పంటల సాగు ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత రైతుసేవా కేంద్రం పరిధిలోని వ్యవసాయ సహాయకుల దగ్గర తీసుకుని ఎకరాకు వరికి రూ.630, వేరుశనగ పంటకు రూ.480, నువ్వులకు రూ.180, జొన్నపంటకు రూ.315, ప్రొద్దుతిరుగుడు పంటకు రూ.300, మినుము పంటకు రూ.285, పెసరపంటకు రూ.270, మామిడికి ఎకరాకు రూ.2.100 చొప్పున చెల్లించాలన్నారు. సంబంధిత బీమా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా నేరుగా చెల్లించవచ్చన్నారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి నరసింహాపురం గ్రామంలోని పురాతన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున లక్ష్మీనరసింహాస్వామి, ఆంజనేయస్వామి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. విశేషంగా నూతన పట్టు వస్త్రాలతో, వెండికవచాలు, రంగురంగుల పూలు, గజమాలలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది.

28న వైజ్ఞానిక ప్రదర్శన

ఖాజీపేట : ఖాజీపేట బాలికోన్నత పాఠశాలలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి స్వర్ణలత తెలిపారు. విద్యార్థులు ప్రయోగ సామగ్రి తయారు చేసుకుని ప్రదర్శనలో పాల్గొనాలన్నారు.

రైతుల భూ సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దారు రమాకుమారి

చాపాడు : రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని తహసీల్దారు రమాకుమారి అన్నారు. మండలంలోని చిన్నగురువళూరులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. గ్రామ సదస్సులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి, నారాయణ స్వామి, శివశంకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రామలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

మైదుకూరు : చేతి వృత్తుల వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) టీఈ కెజియాజాస్లిన్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ మరమ్మతులు, బ్యూటీషియన్, పెయింటర్ అంశాల్లో ఇచ్చే ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోగా ప్రొద్దుటూరు మెప్మా కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులో ఉన్న జ్యోతి ఫుడ్స్ కార్యాలయంలో శుక్ర, శని, ఆదివారాల్లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జ్యోతి ఫుడ్స్ వ్యవస్థాపకుడు జక్కా పెద్దన్న తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జ్యోతి ఫుడ్స్ ఆధ్వర్యంలో ఫార్మింగ్, వెజ్, నాన్ వెజ్ పచ్చళ్ల తయారు చేయనున్నట్లు తెలిపారు. వేతనం రూ.9 వేల నుంచి రూ.12 వేల వరకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

29న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని గాంధీనగర్ నగరపాలకోన్నత పాఠశాలలో ఈనెల 29వ తేదీన జిల్లా స్థాయి కబడ్డీ జూనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి టి. జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు జనవరి 3 నుంచి 6వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించే 28వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2005 డిసెంబర్ 1 తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. బాలుర విభాగంలో 70 కేజీలు, బాలికల విభాగంలో 65 కేజీలు బరువు ఉండాలన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పదోతరగతి ఒరిజినల్ మార్కులిస్టు వెంట తీసుకురావాలని సూచించారు.

రోడ్డు ఇరుకు.. ప్రయాణం బెరుకు

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

బద్వేలు అర్బన్: పట్టణంలోని మెయిన్‌బజార్ (పోరుమామిళ్ల రోడ్డు) గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రయాణం నరకప్రాయంగా మారుతుంది. రోడ్డుకు ఇరువైపులా పూర్తిస్థాయిలో ఆక్రమణలు ఉండటంతో రోడ్డు కుదించుకుపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డులో రెండు వాహనాలు ఒకేసారి వచ్చినా లేదా ఎదురెదురుగా వచ్చినా వెళ్లే దారిలేక భారీగా వాహనాలు ఆగిపోవడం షరామాములే అయింది. అసలే ఇరుకు రహదారితో ప్రజలు సతమతమవుతుంటే .. ఇదే దారి వెంట రెండు ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, ఆయిల్ మిల్ కార్యాలయం ఉండటంతో భారీ వాహనాలు ఈ దారి వెంట తిరుగుతూ మరో పెద్ద సమస్యగా మారింది. అంతేకాకుండా ఈ దారి గుండా రెండు మసీదులతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు ఉండటంతో నిత్యం జన సంచారం అధికంగా ఉంటోంది. ఈ సమయంలో వాహనాలు నిలిచిపోయి పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



పోరుమామిళ్ల రోడ్డులో వాహనాలు ఎదురెదురుగా రావడంతో స్తంభించిన ట్రాఫిక్

చర్యలు తీసుకోవాలి

ప్రమాద సమయాల్లో ఒక్కోసారి 108, ఫైరింజన్ వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ దారిని విస్తరించడానికి గతంలో కొలతలు వేసి మార్కింగ్ ఇచ్చినప్పటికీ పనులు కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. ప్రస్తుతం ఈ సమస్య గట్టెక్కాలంటే పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డు వెంట భారీ వాహనాలు తిరిగేటట్లు చేసి పోరుమామిళ్ల రోడ్డు వెంట ద్విచక్రవాహనాలు, ఆటోలకు మాత్రమే అనుమతిస్తే సమస్య కొంతమేరకైనా పరిష్కారమవుతుందని, ఆ దిశగా పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసుల చొరవ.. గుంతలు పూడ్చివేత

పోరుమామిళ్ల : పట్టణంలోని ప్రధాన రహదారిపై వర్షాలకు ఏర్పడిన గుంతలను పోలీసులు గురువారం పూడ్చివేయించారు. వర్షాలకు రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడగా.. వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు సాయిబాబా మందిరం వద్ద రోడ్డుపై నీళ్లు నిలచి, గుంతలు పడడంతో వాహనాలు పట్టు తప్పి కిందపడుతున్నాయి. నీటిలో రోడ్డు కనిపించక కొందరు ప్రయాణికులు కింద పడి గాయాలపాలయ్యారు. పోలీసులు చొరవ తీసుకోని మట్టితో గుంతలు పూడ్చి రోడ్డు బాగు చేశారు. నిత్యం వాహనదారులు నరకం అనుభవిస్తున్నా.. ఆర్‌అండ్‌బీ అధికారుల్లో ఉలుకూ.. పలుకూ లేకపోవడం పట్ల పలువురు మండిపడుతున్నారు. రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేస్తే ఈ తిప్పలు ఉండవు కదా.. అని స్థానికులు చర్చించుకున్నారు.



గుంతలు పూడ్చిస్తున్న పోలీసులు

గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం

గోపవరం : మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. 15 రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఎక్కడ చూసినా రోడ్లపై మురికినీరు తాండవిస్తుంది. రోడ్లపైనే చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో అధికారులు పర్యటిస్తే సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవచ్చని, కానీ అందుకు పూర్తి విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాచాయపేటలో డ్రైనేజీ కాలువలు పూడికతో నిండిపోవడం, రోడ్లపైన చెత్తాచెదారం పేరుకోపోయి దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశముందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



రాచాయపేటలో రోడ్డుపై మురుగునీరు

సర్పంచ్ అవినీతిని నిరూపిస్తా..

మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ శివచంద్రారెడ్డి అవినీతిని నిరూపించలేకపోతే తన పదవికి రాజీనామా చేస్తానని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ శివచంద్రారెడ్డి అవినీతిని నిరూపిస్తే ఆయన తన సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తాడా అని సవాల్ విసిరారు. ఎక్కడా అవినీతి చేయలేదని, శ్మశాన అభివృద్ధిలో ఎక్కడా అధిక బిల్లులు తీసుకోలేదని సర్పంచ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాము ఆధారాలతో మీడియా ముందు చూపించినా ఇలా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 1.37 ఎకరాల్లో 15 సెంట్లలో మాత్రమే గుంత ఉందన్నారు. దానికి 600 టిప్పులు మట్టి తోలినట్లు శివచంద్రారెడ్డి చెబుతున్నారన్నారు. ఆయన అవినీతికి సంబంధించి బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీలో కోట్లాది రూపాయల అవినీతిపై విజిలెన్స్ ఎంక్వయిరీ వేయిస్తున్నామన్నారు. 1.37 ఎకరాల శ్మశాన స్థలంలో జంగిల్ క్లియరెన్స్‌కు రూ.8లక్షలు డ్రా చేయడం దారుణమన్నారు. 10 అడుగుల లోతు గుంత ఉన్నప్పుడు జంగిల్ క్లియరెన్స్ చేయాల్సిన అవసరం ఏముందన్నారు. మున్సిపల్ ప్లాట్లలో 88 ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్‌కు కేవలం రూ.4.50లక్షలు మాత్రమే ఖర్చయిందన్నారు. అయితే కొత్తపల్లె పంచాయతీలో 1.37 ఎకరాలకే రూ.8 లక్షలు ఎలా అవుతుందని ప్రశ్నించారు. కమర్షికల్ రూమ్‌ల నిర్మాణంలో పట్టాలు అయితే రూ.50వేలు, కాలువ బంజరు స్థలాల్లోని నిర్మాణాలకు రూ.3లక్షలు అనుమతులకు దండుకుంటున్నారన్నారు. శివచంద్రారెడ్డి అవినీతిపై ఎమ్మెల్యే వరద ఎందుకు పిటీషన్లు పెట్టలేదని ప్రశ్నించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ద్వారా కొత్తపల్లె పంచాయతీలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ ఎంక్వయిరీ పెట్టించి తేలుస్తామన్నారు. డిజిల్ వినియోగంలో, విద్యుత్ మోటార్ల కొనుగోలులో భారీ కుంభకోణం జరిగిందన్నారు. వాటిని కూడా త్వరలో అన్ని ఆధారాలతో ప్రెస్ మీట్ పెట్టి బట్టబయలు చేస్తానన్నారు. గ్రామ పంచాయతీలో ప్రజలు చెల్లించిన పన్నులను సర్పంచ్ స్వాహా చేస్తున్నారనే విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

జగనన్న ఇమేజ్‌తో గెలిచావ్ ..

కొత్తపల్లె గ్రామ పంచాయతీలో సర్పంచ్‌గా జగనన్న ఇమేజ్‌తో గెలిచావని కొనిరెడ్డి శివచంద్రారెడ్డిని ఉద్దేశించి కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి అన్నారు. రాచమల్లు శివప్రసాదరెడ్డి ఓటమిలో, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి గెలుపులో శివచంద్రారెడ్డి పాత్ర ఏమీ లేదన్నారు. శివచంద్రారెడ్డి సొంత గ్రామంలోనే వైఎస్సార్‌సీపీకే అధిక మెజారిటీ వచ్చిందన్నారు. 25వేల ఓట్లు ఉన్న కొత్తపల్లె గ్రామ పంచాయతీ నుండి శివచంద్రారెడ్డి కేవలం 72 ఓట్లు మాత్రమే కూటమి ప్రభుత్వానికి మెజారిటీ తెప్పించారన్నారు. సమావేశంలో కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, నాయకులు కశిరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి, ద్వార్శల గురునాథరెడ్డి పాల్గొన్నారు.

నేడు నిరసన ర్యాలీ

ప్రొద్దుటూరు రూరల్ : సీఎం చంద్రబాబు పెంచిన విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రామేశ్వరం రోడ్డులోని వసంతపేట సాయిబాబా గుడి వద్ద నుంచి పవర్ హౌస్ రోడ్డులోని కరెంట్ ఆఫీసు వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బ్రహ్మంగారిమఠం : కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్తు చార్జీల భారం మోపడాన్ని నిరసిస్తూ శుక్రవారం నిర్వహించే నిరసనకు పెద్ద ఎత్తున తరలిరావాలని బి.మఠం జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి కోరారు. మైదుకూరులో జరిగే కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ అనుబంధ సంస్థల నాయకులు, సర్పంచ్‌లు. ఎంపీటీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి అధ్యక్షతన ర్యాలీ ఉంటుందన్నారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

గోపవరం : విద్యుత్ ఛార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేసీఎస్ మండల ఇన్‌చార్జి పుల్లయ్య పిలుపునిచ్చారు. ఉదయం 9-30 గంటలకు బద్వేలు పట్టణం నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి మైదుకూరు రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ ఉంటుందని, ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల శ్రేణులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

ప్రొద్దుటూరు రూరల్ : టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల జీతాల విషయంలో ఏమాత్రం స్పందించలేదన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోరికలను, డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, జీతాలను పెంచేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ నంబర్ 36 అమలు చేయాలని, నైపుణ్యం కలిగిన కార్మికులకు ట్రైనింగ్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. కార్మికుల ప్రమాద బీమాను రూ.7లక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సరైన పనిముట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాఘవేంద్ర, ప్రమీలమ్మ, నీతమ్మ, గుర్రమ్మ, రమాదేవి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి ఎక్కడ..?

ప్రొద్దుటూరు రూరల్ : నిరుద్యోగులకు ఉపాధి ఎక్కడా.. అని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ పట్టణ కార్యదర్శి షరీఫ్ ప్రశ్నించారు. గ్రామ సభల నిర్వహణ, ఉపాధి తదితర అంశాలపై ఆయన గురువారం ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం మేరకు జనవరి 2న గ్రామ సభలను నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే ఈ గ్రామ సభలను ప్రభుత్వాలు నిర్వహించడం లేదన్నారు. ఏడాదిలో మూడు నెలలకు ఒకసారి నాలుగు సార్లు గ్రామ సభలను నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సభల ద్వారా నిరుద్యోగులను గుర్తించి వారికి ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ కార్యవర్గ సభ్యుడు ప్రతాప్ పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఓబుల్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని కోరుతూ ఈనెల 30న దేశవ్యాప్త పిలుపులో భాగంగా కడపలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి, కో కన్వీనర్లు బి.లక్ష్మిరాజా, రిటైర్డ్ డీఈ గుర్రప్ప పిలుపునిచ్చారు. గురువారం కడప నగరంలోని ఇంజనీర్స్ భవనంలో గుర్రప్ప అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షా వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తినా ప్రధాని నరేంద్రమోదీ ఇంత వరకు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఈ పరిస్థితుల్లో నిరసనలు కొనసాగించాలని ప్రజా సంఘాలు నిర్ణయించాయని పేర్కొన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో జమిలి ఎన్నికలపై కూడా చర్చించారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యం పై దాడి చేయడమేనని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం రాజ్యాంగ సవరణ బిల్లుతో సహా మరో రెండు బిల్లులు కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిందన్నారు. వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక నాయకులు డాక్టర్ రాజా వెంగళరెడ్డి, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, చంద్రశేఖర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు రఘునాథరెడ్డి, రవిశంకర్, లెనిన్ ప్రసాద్, రామాంజనేయులు, దస్తగిరిరెడ్డి, గంగా సురేష్ పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్స

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక నెహ్రూరోడ్డులోని వెంకటేష్ స్పైన్ సెంటర్‌లో డాక్టర్ కదిరి వెంకటేష్ అరుదైన శస్త్రచికిత్స చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన 75 ఏళ్ల జాఫర్ కొన్నేళ్ల నుంచి టీబీ వ్యాధితో బాధపడుతున్నాడు. టీబీ కారణంగా అతని వెన్నుపూసకు చీము పట్టింది. దీంతో ఇన్‌ఫెక్షన్ ఎక్కువై అతను బాధపడేవాడు. ఇక్కడ చికిత్స చేయించుకున్న కొందరి సూచన మేరకు జాఫర్ స్పైన్ సెంటర్‌ను ఆశ్రయించాడు. అతన్ని పరిశీలించిన డాక్టర్ వెంకటేష్ కోత, కుట్టు లేకుండానే వెన్నుపూసలోని ఇన్‌ఫెక్షన్‌తో పాటు చీమును శస్త్రచికిత్స చేసి తొలగించారు. అలాగే 35 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ డిస్క్‌జారి వెన్నుపూస సమస్యతో బాధపడుతూ వెంకేటేష్ స్పైన్ ఆస్పత్రికి వచ్చాడు. పరిశీలించిన వైద్యుడు అతనికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చి చిన్నపాటి రంధ్రం వేసి వెన్నులోని దెబ్బతిన్న డిస్క్‌ను తొలగించారు. కేవలం 24 గంటల్లోనే అతన్ని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.



జాఫర్‌కు శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్ కదిరి వెంకటేష్

పాత చౌకదుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గంలో 20 సంవత్సరాలకు పైబడి ఉన్న పాత రేషన్ దుకాణాలకు కూడా కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి, సీనియర్ దళిత నాయకుడు బండిజకరయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏళ్ళ తరబడి పాతుకుపోయిన పాత రేషన్‌దుకాణాలకు కూడా ప్రస్తుత రిజర్వేషన్ ఆధారంగా నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. అన్ని రేషన్ దుకాణాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు కేశవయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు శిఖామణి, ఎస్టీ సంఘం నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

చేతికందేంత ఎత్తులో తీగలు



పొలంలో చేతికి అందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఖాజీపేట మండలం నాగపట్నంలో చేతికి అందే ఎత్తులో విద్యుత్తు తీగలు ఇలా వేలాడు తున్నాయి. రైతు తన పొలంలో పంట సాగు చేయాలంటే భయపడుతున్నారు. విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా స్పందించడం లేదని ఆయన ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - ఖాజీపేట



చెట్టుకు తీగలను కట్టి లాగిన రైతు

ఘనంగా సీపీఐ వందేళ్ల ఆవిర్భావ వేడుకలు



మైదుకూరు : సీపీఐ ఆవిర్భావ వేడుకలో ఆ పార్టీ నాయకులు



బద్వేలు : జండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో సీపీఐ వందేళ్ల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుండి గాంధీ రోడ్డు మీదుగా హోమస్ పేట, పుట్టపర్తి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ సీపీఐ పతాకాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. నేటి బీజేపీ పాలకులు దేశంలోని ఖనిజ సంపదను, వనరులను, ఎయిర్, సీ పోర్టులను, రైల్వేలను, రహదారులను కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని విమర్శించారు. జీఎస్టీ పేరుతో పేద ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారన్నారు. సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ కార్మికులు పోరాడి దక్కించుకున్న చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. సీపీఐ ప్రజల పక్షాన సమరశీల పోరాటాలు చేస్తుందని తెలిపారు. సీపీఐ సీనియర్ నాయకులు గోపాలం రామకృష్ణ, గురుస్వామి, ధనిరెడ్డి శివారెడ్డిలు అందించిన సేవలకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య శాలువా కప్పి సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా సమితి సభ్యులు వై.హరి, వీరయ్య శెట్టి, వద్ది సుబ్బన్న, బాబు, మచ్చా శ్రీను, దేవరశెట్టి నరసింహా, మీరావలి, ప్రమీల, సుజాత, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్, సహాయ కార్యదర్శి వాసు, నాని, తౌసిఫ్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి దస్తగిరి, హర్షవర్ధన్‌రెడ్డి, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ దిదినోత్సవం

మైదుకూరు : పట్టణంలోని మైదుకూరులోని వీణ విజయరామరాజు కాలనీలో గురువారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుక నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ 1925 డిసెంబర్, 26న దేశంలో సీపీఐ ఏర్పాటైందన్నారు. యువజన, విద్యార్థి, కార్మిక, కర్షక, మహిళా సంఘాలుగా ఏర్పడి బలహీన, మైనారిటీ వర్గాల ప్రజల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీరాములు, ఏవీ శివరాం, బి.పీరయ్య, సుబ్బరాయుడు, కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలో ఆ పార్టీ నాయకులు సీపీఐ వంద దినోత్సవ వేడుక జరుపుకొన్నారు. బి.మఠం నాలుగు రోడ్ల కూడలి నుంచి తహసీల్దారు కార్యాలయం దగ్గరకు చేరుకుని సీపీఐ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హృదయనాథ్, నారాయణ, దేవదాసు, విజయచంద్ర, చందు, రవి, మల్లేష్, సంపత్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే సీపీఐ లక్ష్యం

బద్వేలు అర్బన్ : భారతదేశంలో సమసమాజ స్థాపనే లక్ష్యంగా సీపీఐ నిరంతర పోరాటాలు కొనసాగిస్తున్నదని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ పేర్కొన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక బైపాస్‌రోడ్డులోని భగత్‌సింగ్‌నగర్‌లో, సీపీఐ కార్యాలయంలో పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడి కార్మిక, కర్షక, యువజన, విద్యార్థి శ్రేయస్సు కోసం సీపీఐ పోరాడుతున్నదని, ఇలాంటి తరుణంలో అరెస్టులు, లాఠీలు, తూటాలకు భయపడి ఉద్యమాలకు దూరం కాలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు పి.వెంకటరమణ, విజయమ్మ, నాగేష్, శాఖ కార్యదర్శులు నాగసుబ్బయ్య, రమణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

పోరుమామిళ్ల : పట్టణంలో గురువారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కోసం, కార్మిక కర్షకుల కోసం పోరాడటంలో సీపీఐ అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ పురుడుపోసుకుందని తెలిపారు. అనంతరం అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, కేశవ, చెన్నయ్య, జాకోబ్, ఫిరోజ్, షాహిదా, శ్రీనివాసులు, బాలమ్మ పాల్గొన్నారు.